

నేడు, రేపు చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

టిడిపి అధినేత నారా చంద్రబాబున నాయుడు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈనెల 8,9 తేదీల్లో పర్యటన షెడ్యూల్ సోమవారం ఖరారైంది. ఈనెల 8న రాత్రి 10గంటలకు విజయనగరం జిల్లా చేరుకుని అశోక్ బంగ్లాలో బసచేస్తారు. 9న బుధవారం ఉదయం 10గంటలకు రోడ్డు ప్రయాణంలో బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం పట్టణం మీదుగా గరుగుబిల్లి మండలంలోని సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి బ్యారేజి సందర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1గంకు తోటపల్లిలో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. 2.30 ని.లకు ఎర్రన్నగుడి కూడలిలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 4.30 గంటలకు కొత్తవలస మీదుగా పార్వతీపురం పాత బస్టాండ్ వరకు రోడ్డుషో చేస్తారు. అనంతరం అక్కడ సభలో ప్రసంగిస్తారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానం లో రాత్రి బసచేస్తారు. మరుసటి రోజు ఉదయం శ్రీకాకుళం జిల్లాకు వెళ్తారు.



అసైన్డ్ భూములపై రాబందుల కన్ను

పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో వాటిపై రాబందుల కన్ను పడింది. పేదల చేతిలో 20 ఏళ్ల నుంచి ఉన్న అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో పేదల అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి స్వాహా చేసేందుకు బొబ్బిలిలో భూమాఫియా తయారైంది. ఇప్పటికే బొబ్బిలి పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న అసైన్డ్ భూములున్న దళిత, గిరిజన రైతులకు గాలం వేసే పనిలో భూమాఫియా బృందం నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటి వరకు పేదల వద్ద ఉన్న భూములు రాబందుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే వివాదాల్లో ఉన్న అసైన్డ్ భూములను కొనుగోలు చేసినట్లు, ఒప్పంద పత్రాలను రాసుకుంటున్నట్లు చర్చ సాగుతోంది.

యాజమాన్య హక్కులపై ప్రకటనతో భూములను కాజేసేందుకు కుట్ర

ప్రజాశక్తి-బొబ్బిలి

20 ఏళ్ల క్రితం పేదల చేతిలో ఉన్న అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటనతో పేదల భూములను కాజేసేందుకు భూబకాసురులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రామన్నదొరవలస, నారాయణప్ప వలస, గొర్లెసీతారాంపురం, కాశిందొరవలస రెవెన్యూ పరిధిలో అసైన్డ్ భూములు ఎక్కువ ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో జిరాయితీ భూమి ఎకరా రూ.30లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధర పలుకుతుంది. సిఎం సమీప బంధువని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి అసైన్డ్ భూముల వివరాలు తెలుసుకుని, ఇప్పటికే కొంతమంది బ్రోకర్లను ఏర్పాటు చేసి భూయజమానులతో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. 20 ఏళ్లుగా పేదల చేతిలో ఉన్న అసైన్డ్ భూములను ఎకరా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు ముట్టజెప్పి, స్వాహా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

విలువైన భూముల కాజేతకు..

పట్టణ పేదల కోసం రామన్నదొరవలస వద్ద ప్రభుత్వం వేసిన జగనన్న లేఅవుట్ సమీపంలో టిడ్కో ఇళ్ల సముదాయం వెనుక పారాది, పిరిడి, గొర్లెసీతారాంపురం దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూమి వందల ఎకరాల్లో ఉంది. ఆయా భూములను దళితులు, గిరిజనుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి స్వాహా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే రైతులకు అడ్వాన్స్ ఇచ్చి ఒప్పంద పత్రాలు రాసుకున్నట్లు తెలిసింది. దీని వెనుక ఒక విఆర్ఒ, అధికార పార్టీకి చెందిన నేతల హస్తం ఉన్నట్లు సమాచారం.

రెవెన్యూ డివిజన్లో 15,258 ఎకరాలు

బొబ్బిలి రెవెన్యూ డివిజన్లో 2004కు ముందు రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూమి 15,837 మంది రైతులు చేతిలో 15,258.82 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెపుతున్నాయి. వాటి వివరాలు..

మండలం	రైతులు	విస్తీర్ణం(ఎకరాల్లో)
బాడంగి	2905	2772.18
బొబ్బిలి	3590	4113
మెంటాడ	175	411.99
తెర్లాం	3394	2246.54
రామభద్రపురం	2220	2762.10
దత్తిరాజేరు	1269	1278.66
గజపతినగరం	2286	1674.27

అసైన్డ్ భూములపై సర్వే

బొబ్బిలి రెవెన్యూ డివిజన్లో ఉన్న అసైన్డ్ భూములపై సర్వే చేస్తున్నట్లు ఆర్డిఒ పి.శేషశైలజ చెప్పారు. ఎంతమంది రైతులు చేతిలో ఎంత అసైన్డ్ భూమి ఉంది, ఎప్పుడు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందో గుర్తించేందుకు సర్వే చేస్తున్నామని తెలిపారు. కొన్ని మండలాల్లో రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అసైన్డ్ భూములపై సమగ్ర సర్వే చేసి నివేదిక తయారు చేస్తామని వెల్లడించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని

మున్సిపల్ కార్మికుల పొర్లు దండాలు

పోలీసుల దౌర్జన్యం.. బలవంతంగా అరెస్టులు




పొర్లుదండాలు పెడుతున్న మున్సిపల్ కార్మికులు



నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు, ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు, రిస్క్ అలవెన్స్లు చెల్లిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ అమలు చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ వద్ద సోమవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు.అధికారులు స్పందించకపోవడంతో జాతీయ రహదారిపై బైఠాయించి పొర్లుదండాలు చేస్తూ నిరసన తెలిపారు. దీంతో అప్పటికే భారీ సంఖ్యలో ఉన్న పోలీసులు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్, బి.రమణ, రామరావుతో పాటు కార్మికులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి అరెస్టు చేశారు. దీంతో కొద్ది సేపు కార్మికులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. లాగులాట జరిగింది.అనంతరం మిగిలిన కార్మికులను పోలీసులు చెల్లాచెదురు చేశారు. అంతకుముందు కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామన్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా హామీలు అమలు చేయలేదు సరికదా బలవంతంగా ఆప్కాస్ లో చేర్చారని అన్నారు. 60ఏళ్ల దాటిన కార్మికులకు ఎలాంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే ఇంటికి పంపిస్తున్నారని తెలిపారు. దాదాపు 30 సంవత్సరాల పాటు ప్రాణాలకు తెగించి పారిశుధ్య విభాగంలో సేవలందించి రిటైర్ అయిన కార్మికుల దుస్థితి చాలా దయనీయంగా ఉందన్నారు. శాశ్వత స్వభావం కలిగి ఒకే రకమైన పని చేస్తున్న పర్మినెంట్ కార్మికులకు కాంట్రాక్ట్ కార్మికులకు జీతభత్యాల్లో తీవ్రమైన వ్యత్యాసం ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పుని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 30ను సవరించి టెక్నికల్ వేతనాలు, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలన్నారు. రిటైర్ అయిన, మరణించిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్ వాహన డ్రైవర్లకు జీవో నెంబర్ 7 ప్రకారం జీతం 18,500 చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు టి.బాబురావు, ఎం.దుర్గారావు, జె.బాలరాజు, గణపతి, సీతారాం ఉన్నారు. అనంతరం పోలీసులు విడిచిపెట్టారు. ధర్నాలో సిఐటియు నాయకులు రామినాయుడు, విజయనగరం,బొబ్బిలి,రాజాం,నెల్లిమర్ల నుంచి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైసిపిలో చీలికలు మొదలయ్యాయి. ఇతర పార్టీల్లోకి వెళ్లకపోయినప్పటికీ పలు నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు తారా స్థాయికి చేరాయి. పార్టీ జిల్లా నేత చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ అసంతృప్తి జ్వాలలు చల్లారడం లేదు. భవిష్యత్తులో తారా స్థాయికి చేరే పరిస్థితులు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా శృంగవరపుకోట, నెల్లిమర్ల, సాలూరు నియోజకవర్గాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి.

వైసిపిలో చీలికలు

- సాలూరులో అనైక్యత
- ఎస్.కోటలో ఆధిపత్య పోరు
- ముదిరి పాకాన పడిన నెల్లిమర్ల వివాదం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నెల్లిమర్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వ్యవహారశైలిని నిరసిస్తూ నెల్లిమర్ల ఎంపిపి అంబళ్ల సుధారాణి తన పదవికి రాజీనామా చేస్తూ పార్టీకి అందజేశారు. ఆమె భర్త అంబళ్ల శ్రీరాములునాయుడు కూడా రైల్వే సౌత్ సెంట్రల్ బోర్డు సభ్యత్వ పదవి రాజీనామాకు సిద్ధపడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలో కొన్ని అభివృద్ధి పనులకు ఎంపిపి ప్రతిపాదన పెట్టగా, కొందరు సభ్యులు వ్యతిరేకించారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే వ్యతిరేకించారంటూ ఎంపిపి, ఆమె అనుయాయులు మనస్తాపానికి గురయ్యారని, అందువల్లే రాజనామాకు సిద్ధపడ్డారని ప్రచారం నడుస్తోంది. అసైన్డ్ భూముల వ్యవహారంలో కూడా ఎంపిపి భర్త శ్రీరాములు నాయుడు, ఎమ్మెల్యే మధ్య అంతర్గత పోరు నడుస్తోందని కూడా అక్కడక్కడ చర్చ సాగుతోంది. కారణాలు ఏవైనా ఏకంగా ఎంపిపి పదవికి రాజీనామా చేయడం, ఆమె వైపు చాలా ఎక్కువ మంది నాయకులు నిలవడం ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారినట్టేనని పలువురు చెప్తున్నారు.

సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంటలో వైసిపి నాయకుల మధ్య నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారి గడపగడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమాన్ని బహిష్కరించే వరకు వెళ్లింది. మండలంలో వైసిపి కీలక నాయకులుగా ఉన్న డోల బాబ్జీ, తటికాయల గౌరీశ్వరరావు వేర్వేరు గ్రూపులకు నాయకత్వం వహిస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా ఒకరినొకరు ఓడించుకునే వరకూ వచ్చిందని ఆ మండలంలో బాహాటంగానే చర్చ నడుస్తోంది. బాబ్జీకి డిప్యూటీ సిఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్న భావనతో గౌరీశ్వరరావుతోపాటు, పార్టీ మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాలనాయుడు, ఎంపిపి బడ్నాన ప్రమీల, పాచిపెంట వీరంనాయుడు (చినబాబు), చాలా మంది ఎంపిటిసి, సర్పంచులు ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల బాబ్జీ, గౌరీశ్వరరావు కలిసి పనిచేయడం ఎంపిపి, పార్టీ మండల అధ్యక్షుని గ్రూపునకు మింగుడు పడడం లేదు. ఈ నేపథ్యంలో పాచిపెంటలో డిప్యూటీ సిఎం, జిల్లా పరిషత్తు చైర్మన్ చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు నిరాకరించారు. ఎంపిపి, పార్టీ అధ్యక్షులు, వారి అనుయాయులు నేతలిద్దరికీ స్వాగతం పలికి, అక్కడి నుంచి వెనుదిరిగారు. నేతలకే ఇలాంటి అనుభవం ఎదురవడంతో వివాదం తారా స్థాయికి చేరినట్టేనని పలువురు విశ్లేషిస్తున్నారు.

శృంగవరపుకోటలో చాలా కాలంగా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. మరోవైపు ఎమ్మెల్సీ రఘురాజుకు వ్యతిరేకంగానూ శిబిరాలు నడుస్తున్నాయి. ఇటీవల జామి మండల పరిషత్తు సమావేశంలో ఎమ్మెల్సీ, జెడ్పిటిసి మధ్య వివాదం చోటుచేసుకుంది. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కొంతమంది సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి ఎమ్మెల్సీ వెళ్లినప్పటికీ మంత్రి బొత్స హెచ్చరికతో వెంటనే వెనుదిరిగారని ప్రచారం నడుస్తోంది. విజయనగరం నియోజకవర్గంలో ఇంకా బహిర్గతం కాకపోయినప్పటికీ కొంతమంది కార్పొరేటర్లు స్థానిక ఎమ్మెల్యే తీరుపై గుర్రుగా ఉన్నారన్న చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలో వైసిపిలో అంతర్గత పోరు తారా స్థాయికి చేరుతోందనే వాదన గట్టిగానే వినిపిస్తోంది.

విద్యారంగ సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం

బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ నాయకులు



సభలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు.మరోవైపు ప్రభుత్వ విద్యను నాశనం చేసే విధానాలను తీసుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్నాయని మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్యాత్ర 8వ రోజు సోమవారం పూసపాటిరేగ మండలం నుంచి ప్రారంభమైంది. 300 కిలోమీటర్లు పూర్తి చేసుకొని అక్కడి నుంచి రావాడ, అక్కివరం మీదుగా డెంకాడ చేరుకుంది. అంతకుముందు పూసపాటిరేగలో మహా విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ , ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్ దేవ్ సింగ్ మాట్లాడారు. పూసపాటి రేగ మండలంలో పలు విద్యారంగ సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయి ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న అమ్మఒడి నిధులు తక్షణమే విడుదల చేయాలని , ఎటువంటి నిబంధనలు లేకుండా డిగ్రీ విద్యార్థులకు నిధులు విడుదల చేయాలని కోరారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం కబ్జాకు గురవ్వకుండా కాపాడాలని, జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసి, మధ్యాహ్నం భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. ఎన్ఇపి పేరుతో మూసేసిన ప్రాథమిక పాఠశాలలను తిరిగి తెరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. పూసపాటి రేగ మండలం కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రుద్రప్రసాద్ మాట్లాడుతూ యువత చదువు పూర్తి చేసి కొలువులు లేకుండా ఏం చేయాలో దిక్కు తోచక ఎదురుచూస్తున్నారని అన్నారు. తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పూడి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, వి చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.హర్ష, ఎం వెంకీలు పాల్గొన్నారు.

భోగాపురంలో జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా క్యాదర్శి పి.రామ్మోహన్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి బటన్ నొక్కడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంపై లేదన్నారు.సంక్షేమ హాస్టల్స్ లో విద్యార్థులు పరిస్థితి అధ్వానంగా మారిందని అన్నారు.వెంటనే సంక్షేమ హాస్టల్స్ లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హరికృష్ణ, హర్ష డి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎంఎస్ఆర్యు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా యుఎస్ రవికుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ రిప్రంజెటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జిల్లాకు చెందిన యు ఎస్ రవికుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం రాష్ట్ర కేంద్రంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి తో మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న మార్పులు మెడికల్ రిప్రజెంటేటివ్లకు నేడు సవాలుగా మారాయని తెలిపారు. రాష్ట్రంలోను, జిల్లాలోను సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

స్పందనకు 325 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి 325 వినతులు అందాయి. జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్య లపై 240, గ్రామ వార్డు సచివాలయం శాఖకు సంబంధించి 35, గృహనిర్మాణం కు 20, డిఆర్డిఎ 10, జిల్లా పంచాయతీరాజ్ శాఖకు 10, పురపాలక శాఖకు 6, వైద్య ఆరోగ్య శాఖకు 4 వినతులు అందాయి.

ప్రభుత్వ మద్యం షాప్ను వెంటనే మార్చాలి

స్థానిక ఆర్టిఒ కార్యాలయం, దేవాలయం దగ్గర ఉన్న ప్రభుత్వ మద్యం షాప్ను వెంటనే ఇక్కడ నుంచి మార్చాలని పట్టణ టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. మద్యం తాగి డ్రైవింగ్ లైసెన్స్ కు వెళ్ళమని ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకులు వి.మణికుమారి, పి.సుభద్ర, ఎం.పద్మలత, కె.రాధిక, కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

సారిక గ్రామంలో జగనన్న ఇళ్ల కోసం భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు కోరారు. స్పందనలో ఇన్ఛార్జి కలెక్టర్కు వినతినిచ్చారు. ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనకల మురళీమోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అద్దె వాహనాలకు బకాయిలు ఇవ్వాలి

విజయనగరం టౌన్ : జిల్లాలో ఐసిడిఎస్లో సుమారు 15ఏళ్లగా అద్దె కారులు తిప్పుతూ జీవనం కొనసాగిస్తున్న తమకు ఏప్రిల్ నుంచి బకాయిలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే చెల్లించాలని డ్రైవర్లు జాయింట్ కలెక్టర్ను కోరారు. ఈమేరకు స్పందనలో వినతినిచ్చారు. డీజిల్ రేటు సుమారుగా రూ.100 దాటినా తమకు పాత రేటు ప్రకారమే రూ35వేలకు తిప్పుతున్నామని, కార్లకు ఫైనాన్స్ కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వినతినిచ్చినవారిలో గదుల సత్యన్నారాయణ,రెల్లి శ్రీనివాసరావు, బోను అప్పలనాయుడు, చవుడు విజయకుమార్, సుంకి గణపతి, కంది కృష్ణ, గుడిమెట్ల అప్పలరాజు, తదితరులు ఉన్నారు.



దీక్షా శిబిరంలో కూర్చున్న విఆర్ఎలు

విఆర్ఎల నిరసన దీక్ష

కనీస వేతనాలు అమలుకు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీస వేతనాలు అమలు చేయాలని, డిఎను వేతనంతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విఆర్ఎలు సోమవారం కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గురుమూర్తి, జి.వెంకన్న మాట్లాడుతూ విఆర్ఎల నుండి డిఎ తిరిగి చెల్లించాలని ఒత్తిడి తీసుకువచ్చి అన్ని జిల్లాల్లో రికవరీ చేశారని, దీనివల్ల మూడేళ్ల డిఎ ఒకేసారి విఆర్ఎలంతా ప్రభుత్వానికి తిరిగి చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ప్రభుత్వ నిర్ణయంతో హక్కుగా వస్తున్న డిఎను విఆర్ఎలు కోల్పోయారన్నారు. రూ.10,500 వేతనంతో పాటు డిఎ ను కూడా కలిపి ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు..ఇప్పటి వరకు రికవరీ చేసిన డిఎను తిరిగి విఆర్ఎ ఖాతాలో జమ చేయాలని కోరారు. కరోనా సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వేతనం 2 నెలలకు రూ. 2000 కోత విధించారని, వెంటనే ఆ వేతనాన్ని జీతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. భూ సర్వే సందర్భంగా టిఎ, డిఎలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు. నామినీలను విఆర్ఎలుగా నియమించాలని కోరారు .అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, విఆర్ఎలకు అటెండర్, వాచ్మెన్లుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో బి.పెంటయ్య, రాములమ్మ, రమ, ఉమహేశ్వరరావు, మాధవి, అసిరయ్య, ఆదినారాయణ, శారద జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన గ్రామ సహాయకులు పాల్గొన్నారు.



కొండపల్లి అప్పయ్యమ్మ(ఫైల్)

కె.ఎ.నాయుడుకు మాతృవియోగం

గంట్యాడ : బొబ్బిలి మాజీ ఎమ్పి కొండపల్లి పైడితల్లినాయుడు సతీమణి, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తల్లి కొండపల్లి చిన్నప్పయ్యమ్మ (90) సోమవారం సాయంత్రం మృతిచెందారు. కొద్దిరోజులుగా వృద్ధాప్యంతో ఆమె బాధపడుతూ మరణించారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. మంగళవారం గంట్యాడలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

చేనేత కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-విజయనగరం

చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్వజన ఆసుపత్రి జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు హేండలూమ్ వాక్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన శాలను, జెడ్పి ఛైర్మన్ ప్రారంభించారు. అనంతరం పలువురు నేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పట్టించుకోని, నేత కార్మికులను ఎన్నో పథకాలతో ఆదుకున్నారని అన్నారు. దీనిలో భాగంగా వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం క్రింద ప్రతీఏటా రూ.24,000 చొప్పున జిల్లాలోని 3,595 మందికి చెల్లిస్తున్నామన్నారు. సుదీర్ఘకాలంగా వృత్తిని కొనసాగిస్తున్న సీనియర్ చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్ఛార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎస్.కోట ఎంఎల్ఎ కడుబండి శ్రీనివాసరావు, వెలమకార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడుబాబు, డిఆర్ఓ ఎం.గణపతిరావు, చేనేత జౌళిశాఖ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.వసంతసాయి, సిబ్బంది, వివిధ చేనేత సొసైటీలు, నేత కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు

విజయనగరం టౌన్ : జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు ఘనంగా సోమవారం పంచాముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగాయి. చేనేత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ వంకా ఉదయ్ కుమార్, ఉప్పు.ప్రకాశరావు, పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పెడ్లాపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చేనేత కార్మికులు ఐక్య మత్యం తో ఉండాలని,చేనేత కళను మరింత ముందుకు తీసుకెళ్లడం అవసరమని అన్నారు. యువజన అధ్యక్షులు సత్య ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చేనేత మహిళలకు చీరలు పంపిణి చేశారు.



చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభిస్తున్న జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గతం కంటే మిన్నగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు పురస్కరించుకొని 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గతం కంటే మిన్నగా... మరింత గొప్పగా వేడుకలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరును, ప్రగతిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రజల సమక్షంలో శకటాల ప్రదర్శన నిర్వహించాలని సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖల పనితీరు, ప్రగతి గురించి ప్రజలకు తెలిసేందుకు శకటాల ప్రదర్శన చేయాలన్నారు. స్టాళ్ల ఏర్పాట్లలో నూతనత్వం కనిపించాలన్నారు. ఒక రోజు ముందుగానే కలెక్టరేట్ భవనాలను విద్యుదీకరణతో అలంకరించాలని విద్యుత్ శాఖ, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-రామభద్రపురం

పాటలతో సమాజాన్ని చైతన్యం చేసిన విప్లవకారుడు గద్దర్ అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. సోమవారం నాయుడువలస పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణరావు ఆధ్వర్యంలో ప్రజాచైతన్య గాయకుడు గద్దర్‌కు నివాళులర్పించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, రాజా శేఖర్, శ్రీన్నాయుడు, రవి, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

వేపాడ : కొండగంగుపూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా సేవా జానపద కళాపీఠం ఆధ్వర్యంలో గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జానపద కళా పీఠం అధ్యక్షులు బద్రి కూర్మారావు, సభ్యులు పి.సురేష్ పాల్గొన్నారు. గద్దర్ మృతికి పాటలతూటా ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో అంజలి ఘటించారు.

కాలిబాటతో పంటకు మేలు

ప్రజాశక్తి-బాడంగి

వరిపొలంలో కాలిబాటతో పంటకు మేలు చేకూరుస్తుందని రేజేరు విఎఎ వాడాడ సాయికుమార్ తెలిపారు. సోమవారం రేజేరు గ్రామంలో వరినాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. నారు కొనలు తుంచి నాటడం వల్ల వరిలో వచ్చే కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటిమీటర్లు చొప్పున కాలిబాటలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. దీనివల్ల గాలి, వెలుతురు బాగా తగిలి దుబ్బు చేస్తాయని చెప్పారు. ఎరువులు వేసుకోవడానికి, పురుగుమందుల పిచికారీకి వీలుగా ఉంటుందన్నారు.

సక్రమంగా రీసర్వే

ప్రజాశక్తి-కొత్తవలస

స్టోన్ ప్లాంటేషన్ పనులు సక్రమంగా చేయాలని డిప్యూటీ తహశీల్దార్ జె.కె.అప్పారావు సిబ్బందికి సూచించారు. మండలంలోని కంటకాపల్లి గ్రామంలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ వర్క్‌ను డిఐఒఎస్, మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ టి.రమేష్, రీసర్వే డిటి అప్పారావు, మండల సర్వేయర్ గంగాధర్ పరిశీలించారు. స్టోన్ ప్లాంటేషన్ విషయమై గ్రామ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.

బాబోయ్.. కుక్కలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ ప్రజలను కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలోని వీధులలో కుక్కలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలను బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎఇని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉపాధి హామీ కూలీల మరణానికి కారణమైన బాడంగి విద్యుత్తు శాఖ ఎఇని సస్పెండ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎ.సురేష్, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన ఎఇని సస్పెండ్ చేయాలని సోమవారం ఆర్‌డిఒ పి.శేషశైలజ, విద్యుత్తు శాఖ ఇఇ కార్యాలయంలో వినతులు అందజేశారు. బాడంగి మండలం పూడివలసలో విద్యుత్తు శాఖ ఎఇ నిర్లక్ష్యంతోనే ఇద్దరు ఉపాధి కూలీలు మరణించారని చెప్పారు. గతంలో విద్యుత్తు శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఎరుకులపాకలు గ్రామంలో ఇళ్లకు వెళ్లాల్సిన కరెంటు లైన్‌ను నేరుగా కలిపేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని తెలిపారు. సిపిఎం నాయకులు, స్థానిక సర్పంచ్ స్పందించడం వల్ల ప్రమాదం తప్పిందన్నారు. మరణానికి కారణమైన విద్యుత్ శాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, మరణించిన రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

ఠాగూర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జి.ఈరన్న మాట్లాడుతూ నోబుల్ పొందిన తొలి భారతీయుడు ఠాగూర్ అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చల్ల శ్రీనివాసరావు, ఎన్‌సిసి కేర్ టేకర్ పి.భాస్కర్, తదితరులు పాల్గొన్నా.

కరాటేలో సత్తాచాటారు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ నిర్వహించిన కరాటే పోటీల్లో శృంగవరపుకోట మండలానికి చెందిన వి.హార్దిక్ వినయ్ బంగారు, జి.తపశ్యశర్మ, కె.తనుశ్రీ రజతం, ఎస్. నీలేష్, కె.తుసాంత్ కాంస్య పతకాలు సాధించారు. వీరికి కోచ్‌గా ఎ.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు.



హెచ్‌ఎం బిపిఎ రాజుకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

బిపిఎ రాజుకు ప్రశంస

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పి.ఎ.రాజుకు ప్రశంసలు లభించాయి. భీమిలిలో నిర్వహించిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో ఆయన ఉత్తమంగా ప్రదర్శన కనబరిచారు. దీంతో ఆయనకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- డెంకాడ

ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర మహా సభల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భోగాపురం ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు మాట్లాడుతూ ఈ మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు సిఎం జగన్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని కాల పరిమితితో సంబంధం లేకుండా రెగ్యులర్ చేయడం, సచివాలయం సిబ్బందికి ప్రస్తుతం ఇస్తున్న రికార్డ్ అసిస్టెంట్ స్కేల్ కాకుండా జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రిని కోరుతామన్నారు. కార్ర్యమంలో ఎపిఎన్‌జిఒ భోగాపురం కార్యదర్శి సంతోష్, అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్, ఎ.సుధాకర్, పి.కృష్ణవేణి, లక్ష్మణ రావు, పి.సత్యనారాయణ, రమణ, భాస్కర్, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని ప్రేరేపించేందుకు నాభూమి - నాదేశం

9 నుంచి త్యాగధనులను స్మరించుకునే కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించేందుకు, వారిని ఉత్తేజపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని ఈనెల 9నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వాతంత్య్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిన వీరులను, త్యాగధనులను స్మరించుకునేందుకు మన జిల్లాలో గ్రామగ్రామాన, పట్టణాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 9 నుంచి 15వ తేదీ వరకు నేలతల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించి వారికి ఘన నివాళులు అర్పించనున్నట్లు చెప్పారు. తన ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఆ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, వీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శిలాఫలకాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ శిలాఫలకంలో ఆ గ్రామం నుంచి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారందరి పేర్లను



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్

పొందుపరచాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో, పట్టణంలో కనీసం 75 మొక్కలతో అమృత వాటికలు ఏర్పాటు చేయాలన్నారు. దీర్ఘకాలం వుండే మొక్కలను చెరువు గట్లపై, కాలువ గట్లపై నాటాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, డిఇఒ లింగేశ్వరరెడ్డి, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, యూత్ ఆఫీసర్ ఉజ్వల్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

ప్రజాశక్తి - గుర్ల

యువతీ యువకులు శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణ అన్నారు. సోమవారం గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వై20 సిరీస్ అనే కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం యూత్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు బ్రహ్మకుమారీస్ సంస్థ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ రామకృష్ణ మాట్లాడుతూ భారత దేశంలో యువత అత్యధికంగా ఉన్నారన్నారు. వారంతా క్రమశిక్షణతో శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సిస్టర్ మాధురి మాట్లాడుతూ మనసుకు మంచి ఆలోచనలే ఆహారం అని సూచించారు. బ్రహ్మకుమారి సిస్టర్ గౌరీ మాట్లాడుతూ మెడిటేషన్ (ధ్యానం) ద్వారా మాత్రమే మనసును ఆరోగ్యంగా ఉంచుకొని తద్వారా మంచి ఆలోచనలతో పాజిటివ్ దృక్పథంతో ముందుకు వెళ్లగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ టి.ప్రసాద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల పదో తేదిన 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సంఘవీధి, గొల్లపల్లి, సాయినగర్, పిపి యూనిట్ వైద్యులు, సచివాలయాల హెల్త్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. డి వార్మింగ్ డే సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల విద్యాసంస్థల్లో మాత్రలు అందజేయాలని సూచించారు. అనంతరం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు.. మాత్రలను హెల్త్‌సెక్రటరీలకు పంపిణీ చేశారు.

మహిళలు అభివృద్ధికి టిడిపి ప్రాధాన్యత

ప్రజాశక్తి- గరివిడి

మహిళలు అభివృద్ధికి టిడిపి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చీపురుపల్లి నియోజకవర్గ ఇంచార్జి కిమిడి నాగార్జున అన్నారు. పట్టణంలోని పాతగవిడి వీధిలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1500 ఇస్తారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా చదువుతున్న పిల్లలందరికీ ఏడాదికి రూ.15వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, మీసాల కాశి, పిళ్లా కృష్ణవేణి, ఆరతి సాహూ, ముల్లు రమాదేవి, మీసాల జ్యోత్స్న, సబ్బి సోనియా, మన్యపురి కృష్ణవేణి, గవిడి భారతి, పతివాడ శ్రీదేవి, రౌతు పార్వతి, ఈశ్వరమ్మ, దన్నాన సూరపనాయుడు, శనపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి : పట్టణంలో 10, 27వ వార్డుల్లో రూ.13 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి, టౌన్ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటన బాబు వ్యూహమే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జామి

వచ్చే ఎన్నికల్లో గెలుస్తామన్న నమ్మకం ఏ కోశాన లేని చంద్రబాబు వ్యూహంలో భాగంగానే పుంగనూరులో హింసను ప్రేరేపించారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. సోమవారం జామి మండల కేంద్రంలోని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పుంగనూరులో హింసను ప్రేరేపించడమే కాకుండా, లా అండ్ ఆర్డర్‌ను సవ్యంగా నిర్వహిస్తున్న పోలీసులపై దాడి చేసి, 40 మందికి పైగా పోలీసుల రక్తం కళ్లజూశారని తెలిపారు. పోలీసులు సహనం కోల్పోయి కాల్పులు జరిపితే కొందరైనా మరణిస్తారని భావించి, వారి మృతదేహాలతో శవ రాజకీయం చేయాలని చంద్రబాబు తాపత్రయపడ్డారని వ్యాఖ్యానించారు. కానీ దెబ్బలుతిన్నా సర్వే పోలీసులు.. చంద్రబాబు వ్యూహం అమలు కానివ్వలేదని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజలకు ఏం చేస్తామో చెప్పుకోకుండా, కుట్ర రాజకీయాలు చేయడం బాబుకు పరిపాటి అని మండిపడ్డారు. కనీసం చంద్రబాబు కుప్పంలో కూడా గెలిచే అవకాశం లేదని టిడిపి శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు.

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. జామి-3 సచివాలయ పరిధిలో గడపగడపకు మన



ప్రభుత్వ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, పాలనలో వ్యత్యాసాలను వివరించారు. ఏమైనా సమస్యలుంటే తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి శిరెడ్డి చంద్రనాయుడు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, అల్లు సత్యాజి, ఎంపిటిసి సూరిదేవుడు, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణ దిశగా అడుగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చెరువుల సుందరీకరణకు డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నడుం బిగించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు చెరువులను నగరపాలక సంస్థ, ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. తొలుత పెద్ద చెరువు ట్యాంక్ బండ్ మార్గంతో పాటు.. అటు కర్రల మార్కెట్ వైపునా పరిశీలించారు. అనంతరం బుచ్చన్న కోనేరు, నల్లచెరువు, కోమటి చెరువు, అయ్యకోనేరు తదితర వాటిని పరిశీలించారు. చెరువులను ఆధునికీకరించి.. ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. ప్రధానంగా స్థానికులు, వృద్ధులు పిల్లలు నడిచేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ లను సిద్ధం చేయాలని సూచించారు. వీటి పరిరక్షణ, సుందరీకరణ కోసం అవసరమైతే ఆసక్తి ఉన్న స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, ఫ్లోర్ లీడర్ రాజేష్, ఎఎంసి మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్చార్జులు కంటుభుక్త తవిటిరాజు, బొద్దాన అప్పారావు, కాళ్ల సూరిబాబు, ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.



పెద్దచెరువు గట్టును పరిశీలిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

గడపగడపకూ కోలగట్ల

నగరంలో 50వ డివిజన్ రాళ్ళమాలపల్లి పరిధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలన పట్ల, అందుతున్న పథకాలు పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి , కార్పొరేటర్లు కంటుభుక్త తవిటి రాజు, నడిపిల్లి ఆదినారాయణ, కనకల నాగవల్లి తదితరులు పాల్గొన్నారు. అంబటిసత్రం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇంచార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లారు. లబ్ధిదారుల బుక్లెట్లను అందజేశారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోగిరాజుపేటలో జనవాణి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జోగిరాజుపేట పంచాయతీలో ఆదివారం రాత్రి మన ఊరిలో జనవాని కార్యక్రమంలో భాగంగా లోకం మాధవి ప్రతి గడపకి పర్యటించి, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోగిరాజుపేట గ్రామంలో అధిక శాతం మంది రైతులు ఉన్నారని, ప్రస్తుత ప్రభుత్వం ఈ రైతులని పట్టించుకోవడం లేదన్నారు. కూలీలను కూడా విస్మరిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఉపాధి హామీ తప్పించి మిగతా ఎక్కడా పనులు దొరకట్లేదన్నారు. ఇలా అయితే కూలీ చేసుకుని కుటుంబం గడిపే వాళ్ల పరిస్థితి ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళలకి యువతకి ఉద్యోగ అవకాశాలు మెరుగుపడాలి అంటే మన నెల్లిమర్ల నియోజకవర్గంలోకి పరిశ్రమలు రావాలన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ జనసేన పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కార్యాలయానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

వీర బొబ్బిలి మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కార్యాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే శంబంగికి మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రెడ్డి దామోదర్, సభ్యులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

కొత్తవలస: పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిందని ఎంపిడిఒ వై.పద్మజ తెలిపారు. కొత్తవలస మండలంలో కాటకాపల్లి రెండో వార్డు, తుమ్మికాపల్లి మూడో వార్డు మెంబర్లకు మంగళవారం నుంచి గురువారం వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19న ఎన్నిక నిర్వహించి, అదేరోజు ఫలితాలు వెల్లడించనున్నట్లు చెప్పారు.

వేపాడ : ఉప ఎన్నికల నిర్వహణపై ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సంబంధిత అధికారులతో సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విధుల నిర్వహణ, చేపట్టాల్సిన బాధ్యతలపై వివరించారు. సమావేశంలో పిఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎమ్‌డి కుర్షి జాలి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, డిటి సన్యాసినాయుడు, ఎంఇఒ పి.బాలభాస్కరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లిమర్ల : నగర పంచాయతి పరిధిలోని 5,7,8 వార్డుల్లో సోమవారం సిసి రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణాలకు చైర్‌పర్సన్ బంగారు సరోజిని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర పంచాయతిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కారు కొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, నాయకులు పాండ్రంకి సత్య నారాయణ, పైలమురళీ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

జామి : మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ద్వారా పేదలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు నారాయణరావు మాట్లాడుతూ ప్రతినెలా ఒంటరి మహిళలు, వృద్ధులకు, ఏ ఆధారమూ లేనివారికి హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా సుమారుగా 20 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

సామర్థ్యానికి తగ్గ బోధన

పూసపాటిరేగ : వికలాంగ పిల్లల్లోని సామర్థ్యాలకు అనుగుణంగా బోధన జరపాలని మండల విద్యాశాఖాధికారి ఎ. రాజ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వికలాంగ విద్యార్థులలోని వివిధ సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ పిల్లలవలే వీరిలోనూ అన్ని సామర్థ్యాలు ఉంటాయని వాటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. ఇంటిలో వారు చేయగలిగే చిన్న చిన్న పనులను అప్పగించాలన్నారు. సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాలలోనూ వీరు పాల్గొనేటట్లు చూడాలన్నారు. వీటి ద్వారా వారిలో ఆత్మన్యూనత భావం పోయి అందరిలో తాము ఒకరమనే భావం ఏర్పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. నీలిమ, సహిత విద్య ఉపాధ్యాయులు నడిపేన బంగారునాయుడు, ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

మెంటాడ : మెంటాడ ఎగువ వీధి ప్రాంతంలో పాలూరి పరుశురాంకు చెందిన పూరిల్లు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల సోమవారం దగ్ధమైంది. సుమారుగా రూ.2 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, బాధితులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ రామకృష్ణ హామీనిచ్చారు.

బొబ్బిలిలో డిప్లొమో యోగా కోర్సులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలోని శ్రీయోగ విద్యాసంస్థలో ఆంధ్రా యూనివర్సిటీ డిప్లొమో యోగా కోర్సు అందుబాటులోకి వచ్చినట్లు డైరెక్టర్లు ఎంఇవి ప్రసాద్, కె.సత్య తెలిపారు. యోగా కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి ప్రాంతంలో యోగాను అభివృద్ధి చేసేందుకు ఆంధ్రా యూనివర్సిటీ గుర్తింపుతో డిప్లొమో కోర్సు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్న వారు డిప్లొమో యోగాలో చేరేందుకు అర్హులని, వయసుతో సంబంధం లేదని చెప్పారు. ఆరు నెలలు కోర్సు కాలపరిమితి ఉంటుందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటలు యోగా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకుంటే 19న కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9966229011, 7013969066 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజల సహకారంతోనే పార్కులకు మనుగడ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా సహకారంతోనే పార్కులకు మనుగడని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాములు నాయుడు అన్నారు. సోమవారం నగరంలోని వివిధ పార్కులను ఆయన సందర్శించారు. పిఎస్ఆర్ కాలనీలో ఉన్న పార్కు వద్దకు చేరుకుని అక్కడ విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. పార్కులో కూడా దట్టమైన చెట్లు పెరిగే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సచివాలయ సిబ్బందికి మొక్కల పెంపకంపై బాధ్యతను ఉంచారు. పిఎస్ఆర్ పార్కులో 400 వరకు మొక్కలను నాటుతున్నామన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవడమే ఈ సంవత్సర లక్ష్యమని పునరుద్ఘాటించారు.

మెర్సివాల్ సేవలు ప్రారంభం

బొబ్బిలిరూరల్ : నిరుపేదలకు సేవలు అందించేందుకు రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన దయగలగోడ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. పట్టణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన దయగలగోడను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శేషశైలజ, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఒ రవికుమార్, ఒకటో వార్డు కౌన్సిలర్ చోడగంజి రమేష్‌నాయుడు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, అడ్వకేట్ రుంకాన ప్రసాద్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-మెంటాడ

మెంటాడ గ్రామంలో 2018లో నమోదైన హత్య కేసులో నిందితుడు రాయిపల్లి అచ్చియ్య (ఎ-1)కు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ విజయనగరం ఫోర్త్ ఎడిజె/ఎస్‌సి, ఎస్‌టి కోర్టు తీర్పునిచ్చింది. ఆంద్ర ఎస్ఐ సిద్ధార్థ్ కుమార్ కథనం ప్రకారం.. మెంటాడ ఎగువవీధిలో నివాసం ఉంటున్న కొల్లి కొండమ్మ, భర్త సత్యనారాయణతో కలిసి వివాహం అనంతరం కన్నవారింటికి ఇల్లరికం వచ్చారు. కొల్లి కొండమ్మ తండ్రి ఇల్లరికం వచ్చిన కూతురికి ఆస్తిలో వాటా ఇచ్చేందుకు సమ్మతించారు. కొండమ్మ తమ్ముళ్లు రాయిపల్లి అచ్చియ్య (ఎ-1), రాయిపల్లి సీతన్న (ఎ-2), మరదలు రాయిపల్లి గౌరమ్మ (ఎ-3) ఆస్తి ఇచ్చేందుకు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆస్తి విషయమై కుటుంబ సభ్యుల మధ్య 2018 జూన్ మూడో తేదిన రాత్రి వివాదం చెలరేగింది. నిందితులు తన భర్త కొల్లి సత్యనారాయణను హత్య చేసినట్లుగా అదే నెల నాలుగో తేదిన పోలీసులకు కొండమ్మ ఫిర్యాదు చేశారు. ఆంద్ర పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిపై కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరారోపణలు రుజువు కావడంతో నిందితుడు రాయిపల్లి అచ్చియ్య (ఎ-1)కు జీవిత ఖైదు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఎ-2, ఎ-3పై నేరారోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా పరిగణించినట్లుగా ఆంద్ర ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్ రోడ్డు బాగు చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైల్వే స్టేషన్ రోడ్డు బాగుచేయాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేవ్యాగన్ లోడుకు భారీవాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారి పాడైపోయిందన్నారు. రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడటంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రోడ్డు బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

హెచ్‌ఎంలతో సమావేశం

వేపాడ : స్థానిక ఎంఆర్‌సిలో ప్రధానోపాధ్యాయులతో ఎంఇఒ పి.బాలభాస్కరరావు సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఫేషియల్ అటెండెన్స్, విద్యార్థుల హాజరు, సిలబస్, తల్లిదండ్రుల సమావేశాలు, తదితర వాటిపై చర్చించి, పలు సూచనలు చేశారు.

బీమా సాయం అందజేత

వేపాడ : మండలంలోని బానాది గ్రామానికి చెందిన బాణాల దేవుడు (47) అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. దేవుడు తల్లి దేవుడమ్మకు వైఎస్ఆర్ బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ.10 వేలను సర్పంచ్ కర్రి యశోద, ఎంపిటిసి గొంప తులసి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ అందజేశారు.



ఆర్థికసాయం అందిస్తున్న టిడిపి యువనేత గొంప కృష్ణ

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చామలాపల్లిలో అగ్నిప్రమాద బాధితురాలు మేగడ లక్ష్మీకాంతానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ రూ.5 వేలు నగదు, దుస్తులు అందించారు. సోమవారం బాధితురాలిని పరామర్శించి, ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు జె.ఈశ్వరరావు, ఎస్.గణేష్, సూర్యం, సిరికి రమణ, తాడి కృష్ణ, గొర్లె నాగరాజు పాల్గొన్నారు. అగ్ని ప్రమాద బాధితురాలికి ఎంపిపి డి.సత్యవంతుడు రెండు రైస్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచ్ కోలా సతీష్, నాయకులు బొడ్డు శీను, డి.సత్తిబాబు, గంగాధర్ పాల్గొన్నారు.